క్లుప్తంగా

డిప్యూటీ డెమో అధికారిగా కనకరత్నం



నెల్లూరు (అర్బన్): నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ డెమాన్‌స్ట్రేషన్ అధికారిగా కే కనకరత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య నియామకపత్రం అందజేసి అభినందించారు. ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఏవైఎఫ్ ఆసరా



నెల్లూరు(అర్బన్): అమ్మయూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3, 10వ డివిజన్లకు చెందిన ముగ్గురు నిరుపేద వృద్ధులకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. దివంగత పలక రమణమ్మ జ్ఞాపకార్థంగా చిన్నపిల్లల ద్వారా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ తమ సంస్థ తరుపున పేద వృద్ధుల కుటుంబాలకు తమ శక్తి మేరకు ప్రతి నెలా పింఛన్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు దేవకుమార్‌రెడ్డి, ఉమాదేవిరెడ్డి సహకరించారు. ఫౌండేషన్ సభ్యులు ధనుష్, శశి, కిరణ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వసంతోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం రాత్రి బండాసుర వధ అలంకారోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. మూలస్థానేశ్వరుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉభయకర్తగా కే మాలకొండయ్య వ్యవహరించారు.

వ్యక్తిపై దాడి

- బంగారు ఉంగరం, నగదు అపహరణ


నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి అతని చేతికున్న బంగారు ఉంగరం, జేబులోని నగదు దోచుకెళ్లిన ఘటనపై ఆదివారం అర్ధరాత్రి చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..నేతాజీ నగర్‌కు చెందిన పీ జాషువా లిఫ్ట్‌మెకానిక్. ఆయన అన్న కుమారుడు హర్ష తన స్నేహితులతో కలిసి గత నెల 29న రాత్రి జెడ్పీ సెంటర్‌లోని గోల్డన్‌గ్రాండ్ లాడ్జిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. హర్ష తన బాబాయికి ఫోన్‌చేసి రమ్మనడంతో జాషువా లాడ్జికి వచ్చాడు. అందరూ కలిసి అక్కడే మద్యం సేవించారు. అనంతరం కొందరు ఇళ్లకు వెళ్లిపోగా జాషువా, డేవిడ్, కాశి, తదితరులు లాడ్జిలోనే నిద్రపోయారు. 30న సాయంత్రం 5గంటల ప్రాంతంలో వారు లాడ్జిలో పడుకుని ఉండగా గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వారి గదిలోకి వచ్చి దాడిచేశారు. బీర్ బాటిల్‌తో జాషువాపై దాడిచేసి అతని చేతికున్న 8 గ్రాముల బంగారు ఉంగరం, జేబులోని రూ.450 అపహరించుకెళ్లారు. గాయాలపాలైన జాషువాను అక్కడున్న వారు జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ మేరకు బాధితుడు ఆదివారం అర్ధరాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ ఎం సురేంద్రబాబు కేసు నమోదు చేశారు. సీసీపుటేజీల ఆధారంగా నిందితులు పాతనేరస్తులుగా గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని 53/1 సచివాలయ పరిధిలోని మోపూరు విజయమ్మ గుండె సంబంధిత వ్యాధితో గత కొన్ని రోజులుగా నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ శ్రీలత సోమవారం ఆస్పత్రికి వెళ్లి విజయమ్మకు వితంతు పింఛన్ రూ.2,750 నగదు అందజేసింది.

త్రైత సిద్ధాంత ప్రచారం



నెల్లూరు(బృందావనం): ప్రతి శరీరం ఆత్మశక్తిని కలిగి ఉంటుందన్న విషయాన్ని త్రైత సిద్ధాంతం వివరిస్తుందని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి తెలిపారు. త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మూలాపేట ప్రాంతంలో సోమవారం ఇందూధర్మప్రచారం చేపట్టారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులచే రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కేవీ రత్నం, ఎం సుధాకర్‌ఆచారి, నరసారెడ్డి, ఎం పద్మజ, ఎన్ మనోజ, రూ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

- వామపక్షాలు, కార్మిక సంఘాల ర్యాలీ
- సుందరయ్యకు నివాళులర్పించిన నేతలు



నగరంలో మహాప్రదర్శన చేపడుతున్న కార్మికులు

నెల్లూరు(వేదాయపాళెం): ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నగరంలో వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎర్రజెండాలను ఎగురవేశారు. కనక మహల్ సెంటర్‌లోని దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళ రాష్ట్ర మాజీ మంత్రి ఎంఏ బేబి, సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఎం సీనియర్ నేతలు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, గోగుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, పలు కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు, తదితరులు నివాళులర్పించారు. సాయంత్రం బోసుబొమ్మ సెంటర్‌నుంచి వీఆర్సీ సెంటర్ వరకు కార్మికులు ఎర్రజెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు.

- ఏఐఎఫ్‌టీయు(న్యూ), సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో కార్మికులు ప్రదర్శన చేపట్టారు. జనశక్తినగర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. జీవీఆర్ సెంటర్‌లో సింహపురి ఆటో డ్రైవర్స్ యూనియన్ జెండాను యానాదయ్య ఎగుర వేశారు. సండేమార్కెట్ సెంటర్‌లో మార్కెట్ కార్యదర్శి సెంథిల్‌కుమార్ ఎర్రజెండాను ఎగుర వేశారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌బాబు, లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- పప్పులవీధిలో ఆటో వర్కర్స్ యూనియన్, హమాలీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు యూనియన్ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు.
- సంతపేట ఆజాద్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్ ఎర్రజెండాను ఎగుర వేశారు. సీపీఐ నాయకులు షానవాజ్, అజీజ్, వెంకటేశ్వర్లు, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి

నెల్లూరు (టౌన్): కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు బాబురెడ్డి అన్నారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పనిదినంతో పాటు కనీస వేతనాలను సాధించుకున్నారని చెప్పారు. పోరాడి సాధించుకున్న ఫలితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నాయన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధరరావు, నాయకులు సురేంద్రరావు, మధుసూదన్‌రావు, బాలరాగయ్య, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, గాంధీ గిరిజనకాలనీ లలోని సీపీఎం పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. విజయ డెయిరీ, కేంద్ర గిడ్డంగుల సంస్థ లో మేడే వేడుకలను కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు మూలం ప్రసాద్, నాగేశ్వరరావు, గడ్డం శ్రీనివాసులరెడ్డి, బాబు, బయ్యన్న, వెంకటేశ్వర్లు, దస్తగిరి, ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ పెద్దాస్పత్రుల్లో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కిన్నెర కుమార్, సందానీబాషా, కమ్మటి శ్రీనివాసులు, విజయకుమార్, షబ్బీర్, పుష్పలత, రేవతి, నాగమ్మ, వైద్యశాఖ, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు మూలం రమేష్, మోహన్‌రావు, శ్రీరాములు



ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో..



ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



వెంకటేశ్వరపురం సెంటర్‌లో..



యూటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతున్న బాబురెడ్డి

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



నాడు-నేడు పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి నాడు-నేడు పనులను నాణ్యతలో రాజీలేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జేసీ కూర్మనాథ్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి ఎంపీడీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాడు-నేడు రెండో విడత పనులను వేసవి సెలవులు ముగిసేలోగా యుద్ధప్రాతిపదికన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాడు-నేడు పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు-నేడు పనులపై రోజువారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. తరగతి గదులు మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు, మరమ్మతులు, తాగునీరు, ఫర్నిచర్ మొదలైన ఆరు రకాల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కొడవలూరు, ఏఎస్‌పేట, సైదాపురం, ఇందుకూరుపేట, కలిగిరి, తదితర మండలాల్లో నాడు-నేడు పనుల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పనుల్లో పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో నాడు-నేడు పనుల పురోగతిని పరిశీలించేందుకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వారం రోజుల్లో రానున్నారని తెలిపారు. ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు పనుల పురోగతిపై రోజువారీ సమీక్షించి పాఠశాలలు ప్రారంభమయ్యేల్లోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు, అశోక్ కుమార్ రంగవరప్రసాద్, ఐటీడీఏ పీఓ మందా రాణి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దాతృత్వం

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ప్రగతి ఛారిటీస్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు రూ.3లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఎంపీ వేమిరెడ్డి గత 16ఏళ్లుగా ప్రగతి ఛారిటీస్‌కు చెందిన దివ్యాంగ పిల్లలకు నగదు సాయం అందజేస్తున్నారు. అందులో భాగంగా ఎంపీ వేమిరెడ్డి తన సతీమణి ప్రశాంతి రెడ్డితో కలిసి తన కార్యాలయంలో నగదు చెక్కును ప్రగతి ఛారిటీస్ ప్రతినిధులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ దంపతులకు ప్రగతి ఛారిటీస్ ప్రతినిధులు, పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రగతి ప్రతినిధులకు రూ.3లక్షల చెక్‌ను అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు

స్పందన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలి

నెల్లూరు(బారకాసు): స్పందన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో ఆయన పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. పది ఫిర్యాదులు అందాయి. అనంతరం స్పందన అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను పరిష్కరించారా.. లేదా అని తాను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తానని, పరిష్కరించని పక్షంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

శేష జీవితాన్ని హాయిగా గడపాలి

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బంది శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో హాయిగా గడపాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. దర్గామిట్ట పోలీసుస్టేషన్ ఎస్సై పీ రామారావు, స్వచ్ఛంద, బీడీటీం హోంగార్డు సీహెచ్ బాబురావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని ఎస్పీ శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఎస్పీలు డీ హిమవతి, శ్రీనివాసరావు, ఏఓ విజయకుమార్, హోమ్‌గార్డ్స్, ఏఆర్ డీఎస్పీలు చంద్రమోహన్, గాంధీ, ఆర్‌ఐలు పాల్‌రాజు, మౌలుద్దీన్, ఏపీ పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, నాయకులు ఎంజీఆర్, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న ఆలయ అర్చకులు



విద్యుద్దీప కాంతుల్లో వేదగిరి క్షేత్రం

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహ కొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి శేష వాహనసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవారిని విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. శ్రీవారు,ఆదిలక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా మారింది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

4న నృసింహ జయంతి

నెల్లూరు(బృందావనం): నృసింహ జయంతిని పురస్కరించుకుని సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరంలో ఈ నెల 4న నృసింహ అలంకారం, 5న పౌర్ణమి నాడు కూర్మావతారం అలంకారంలో శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపట్నుంచి హనుమాన్‌చాలీసా పారాయణం

ఈ నెల 14న హనుమజ్జయంతి సందర్భంగా శ్రీకృష్ణయోగమందిరం ప్రాంగణంలోని కార్యసిద్ధి ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం నుంచి సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు జరిగే హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన భక్తులు 94415 48655, 86135 00294 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ధర్మకర్తల మండలి సభ్యులకు శిక్షణ

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని ఆలయాల ధర్మకర్తల మండలి సభ్యులు, చైర్మన్లకు రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం ఉదయం 10గంటలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ ఆలయ ఈఓ ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి సోమవారం తెలిపారు. దేవదాయ,ధర్మదాయ శాఖ కమిషనర్ ఉత్వర్వుల మేరకు ఒక్క రోజు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమంతుడు గొప్ప కార్యసాధకుడు

నెల్లూరు(బృందావనం): హనుమంతుడు గొప్ప కార్యసాధకుడని, రామబంటు గుణగణాలు,శక్తియుక్తులు, కార్యనిర్వహణలో ఏకాగ్రత, సేవాతత్పరతను సుందరకాండ వివరిస్తుందని ప్రముఖ ఉపన్యాసకులు బ్రహ్మశ్రీ గుడ్లదొన వెంకట సాయి ఆంజనేయవరప్రసాదరావు ప్రవచించారు. సండేమార్కెట్ వద్ద చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆదిశంకర ధ్యాన మందిరంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల స్మరణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం ఆయన సుందరకాండపై ప్రవచించారు. తొలుత ఆదిశంకర ధ్యానమందిరం నిర్వాహకులు స్వామి సమయానంద నాథ ఉపన్యసించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు కేదార్‌నాథ్ నందు అంతర్ధానమై కైలాసానికేగారని తెలిపారు. ఆదిశంకరాచార్యులను స్మరించే ప్రతిఒక్కరికీ దైవానుగ్రహం సిద్ధించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఇనమడుగు శ్రీరామకృష్ణానంద ఆశ్రమాధిపతి కృష్ణానందగిరిస్వామిని ట్రస్టు తరుపున శనగవరపు సత్యనారాయణమూర్తి దంపతులు సత్కరించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజింగ్‌ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, భువనేశ్వరిప్రసాద్, నాగఫణిశర్మ, ప్రభాకర్‌రావు, ప్రభాకరశర్మ, ఛాయాదేవి, వెంకటేశ్వరప్రసాద్, రాజా పాల్గొన్నారు.



కృష్ణానందగిరిస్వామికి సత్కారం

రక్తదానంతో ప్రాణదానం

నెల్లూరు (అర్బన్): మేడేను పురస్కరించుకుని దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య విద్యార్థులు సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్‌బాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలన్నారు. అనంతరం పేద రోగుల కోసం రక్తదానం చేసిన వైద్యవిద్యార్థులను అభినందించారు. ఆస్పత్రిలో రక్త నిల్వలు లేకపోవడాన్ని గుర్తించి రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. వైద్యకళాశాల వైస్‌ప్రిన్సిపల్ గోవిందు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళారాణి, ప్రొఫెసర్ నరేంద్ర, అసోసియేట్ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వైద్య విద్యార్థులు

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



మహాకుంభాభిషేక వేడుకలకు సిద్ధం చేసిన యాగశాల



నూతన విగ్రహాల జలాధివాసం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం, త్యాగరాజ నగర్‌లోని సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా కేదార్‌నాథ్ నుంచి తీసుకొచ్చిన సాలిగ్రామశివలింగం(త్యాగరాజేశ్వరుడు), పార్వతిమాత(కమలాంబికా),దక్షిణామూర్తి, నందీశ్వరుడు, సద్గురు సాయిబాబా, శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. తొలిరోజు ప్రతిష్ఠాపనాచార్యులు మాచవోలు వెంకటసుబ్బయ్యశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు, హోమాలు, జలాధివాసం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం కలశపూజ, గ్రామోత్సవం, విశేష హోమాలు, బుధవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, విశేష హోమాలు, పూజలు, సాయంత్రం 6.30గంటలకు శాంతి కల్యాణం, రాత్రి 9గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు త్యాగరాజ మందిర కమిటీ కార్యక్రమ నిర్వాహకులు ఎనమండ్ర నాగదేవిప్రసాద్, ధర్మకర్త ఎనమండ్ర చైతన్యకుమార్ తెలిపారు.

డీఏ మంజూరుపై హర్షం

నెల్లూరు (దర్గామిట్ట):ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ మంజూరు చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు జీఓఎంఎస్ నంబర్లు 66,67 ద్వారా డీఆర్ 2.73 శాతం మంజూరు చేశారని చెప్పారు. ఈ కొత్త డీఏను జూలై 2023 నుంచి జీతంతో కలిపి ఇస్తారని తెలిపారు. జనవరి 2022 నుంచి జూన్ 2023 వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను సెప్టెంబర్, డిసెంబర్, మార్చి నెలల్లో మూడు సమాన వాయిదాల్లో చెల్లిస్తారని తెలిపారు. కొత్త డీఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డీఏ 22.75 శాతం అవుతుందని, పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

వివాహితకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్): తనతో మాట్లాడమని వివాహిత చేయిపట్టుకుని లాగిన వ్యక్తిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..స్టోన్‌హౌస్‌పేటలో ఓ దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త వ్యవసాయం చేసుకుంటుండగా, భార్య నగరంలోని ఓ షాపులో పనిచేస్తున్నారు. వారి ఇంటి సమీపంలో ఉన్న మునీర్ గత కొంతకాలంగా ఆమెను తనతో మాట్లాడమని వేధింపులకు గురిచేయసాగాడు. ఈ నేపథ్యంలో గత నెల 30న రాత్రి ఆమె బాత్‌రూమ్‌కు వెళుతుండగా మునీర్ ఆమె చేయిపట్టుకుని తనతో మాట్లాడమని ఒత్తిడితెచ్చాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో భర్త, స్థానికులు రాగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కే తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.